

నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 57

మా అమ్మ జీవితమే నా సాహిత్యం

- వి. రాజారామమోహనరావు

సమాజంలో అట్టడుగు వర్గాలకు జరుగుతున్న అన్యాయం పట్ల 'మనిషిగా నిరసన' తెలుపుతూ, 'మనచుట్టూ' వ్యాపించిన 'తెల్లటి చీకటి'లో 'కలసి బతకటం' కష్టమైన వైనాన్ని కథలు కథలుగా రాస్తూ, మన పక్కనే 'ఖూనీ' జరుగుతున్నా పట్టించుకోకపోవడం 'అలవాటైపోతున్న' మనుషుల గురించి ఆవేదన చెందుతూ, 'తోడేళ్ల మధ్య' 'మనసున్న బతుకు'లు ఎలా 'అలజడికి' లోనవుతున్నాయో తెలుపుతూ, అంతా 'బిజినెస్'గా మారిన జీవన'వేగం'లో 'వెలుగు'ను తెచ్చే 'కదలిక' కోసం తపిస్తూ, అనేక కథలు, నవలలు రాసిన వి.రాజారామమోహనరావు గారితో ఇంటర్వ్యూ ఈ వారం..

నా సాహిత్య ఆసక్తికి నాంది అదే!

సొంత ఇల్లు , మరే ఇతర స్థిరాస్థి లేకపోతే పుట్టి పెరిగిన ఊరితో సంబంధాలు తెగిపోతాయి. నేను పుట్టింది రాజమండ్రిలో 3 జనవరి 1946న. తాడేపల్లిగూడెం, సరిపల్లి, నిడదవోలు, పెద్దాపురం, ఏలూరు ఊళ్లల్లో నా బాల్యమూ, చదువూ సాగాయి. బాల్యంలో ఎక్కువ కాలం ఏలూరులో ఉండటం వల్ల నా ఊరు ఏలూరుగానే భావిస్తాను. అక్కడ పెదపూడి కుమారస్వామి (బాలయ్య) నా క్లాస్‌మేటు. అతను ఆ రోజుల్లోనే పద్యసాహిత్యం, సంప్రదాయ సాహిత్యం గట్టిగా చదివేవాడు. వాడి సాన్నిహిత్యమే నా సాహిత్య ఆసక్తికి నాంది.

12 ఏళ్లకే డిటెక్టివ్ నవల రాశాను

ఆ రోజుల్లో డిటెక్టివ్ సాహిత్యం విపరీతంగా వచ్చేది. డా.ఎం. మల్లికార్జునరావు 'డాక్టర్' అనే పేరుమీద డిటెక్టివ్ నవలలు రాస్తూ 'భానూదయ' అనే పబ్లికేషన్ నడిపేవారు. ఆయన ప్రముఖ డిటెక్టివ్ నవలా రచయిత విశ్వప్రసాద్‌కు అన్నగారు. డాక్టర్‌గారి కుటుంబం, మా కుటుంబం అప్పట్నించీ ఇప్పటిదాకా ఎంతో దగ్గర. నన్ను తన స్వంత కొడుకులా పెంచిన వ్యక్తి ఆయన.

భమిడిపాటి జగన్నాథరావుతో...

ఈ కారణం వలన మా ఇంటికి విరివిగా డిటెక్టివ్ పుస్తకాలు వచ్చేవి. చాలామంది రచయితల్లానే నాకు కూడా డిటెక్టివ్ పుస్తకాలతోనే చదివే అలవాటు ఏర్పడింది. తర్వాత వాటిని వదిలేసి మిగిలిన పుస్తకాల మీద ఆసక్తి మళ్లింది. ఈ వాతావరణంలో నేనూ, కుమారస్వామి కలసి ఒక డిటెక్టివ్ నవల ఆరంభించాం. అప్పుడు నాకు పన్నెండేళ్ళు. 50 పేజీలకు ఆ నవల పూర్తయిపోయింది. అంటే డిటెక్టివ్ నవలలో నాలుగోవంతు. దానిని ఎలా పెద్ద నవలగా రాయాలో మాకు అర్థం కాలేదు. అందుకని దానిని అలానే వదిలేశాం. ఆ తర్వాత ఎప్పుడు, ఎలా కథలు రాయాలనిపించిందో నాకు గుర్తు లేదు. కానీ కథలు రాయడం మాత్రం మొదలు పెట్టాను. నేను ఉద్యోగంలో చేరక ముందే చాలా కథలు రాశాను.

సాహిత్యమే జీవితంగా మారిపోయింది

1965లో రైల్వే ఇంటర్వ్యూ కోసం హైదరాబాద్ వచ్చాను. ఇక అప్పటి నుంచీ ఇక్కడే ఉండిపోయాను. 65 చివర్లో రైల్వేలో జాయిన్ అయ్యాను. 1966లో అనుకుంటాను, ఆంధ్రప్రభ, కృష్ణాపత్రికలలో ఒకేసారి నావి రెండు కథలు వచ్చాయి. ఈ కథలతో హైదరాబాద్‌లో గుమ్మా ప్రసన్నకుమార్, శీలావీర్రాజు, శ్రీపతి గారు పరిచయం అయ్యారు. ఇది జరిగిన కొద్ది రోజులకే కథకుడు, చిత్రకారుడు చంద్రతో పరిచయం జరిగి, స్నేహంగా మారింది. చంద్ర పరిచయంతో నా హైదరాబాద్ జీవితం కొత్త పుంతలు తొక్కింది. సరికొత్త లోకంలా నా బతుకు మారిపోయింది. మేం ప్రతి రోజూ కలుసుకునేవాళ్లం. అద్భుతమయిన కథల గురించి మాట్లాడుకునేవాళ్లం. మహాద్భుతం అన్పించే ఇంగ్లీషు సినిమాలు చూసేవాళ్లం. నాకు సాహిత్యమే జీవితంగా మారిపోయింది.

మాది నారాయణగూడ బ్యాచ్

నారాయణగూడలో కొంతమంది రచయితలం తరచూ కలుసుకునేవాళ్లం. ఇది చాలా కాలం కొనసాగింది. మా అందరికీ నారాయణగూడ రచయితలు అనే పేరు వచ్చింది. ప్రతి ఆదివారం అక్కడకు కథతో వెళ్లాలన్న నియమం ఉండేది. అందరూ కథలో, కవితలో తెచ్చేవారు. వాటిని అక్కడ చదివి చర్చించేవాళ్లం. మాకు అప్పట్లో కథ అచ్చవుతుందా కాదా అనే దృష్టి కన్నా మంచి కథ రాయాలన్న తపనే ఎక్కువ ఉండేది. మా నారాయణగూడ బ్యాచ్ కథ బాగుందని సర్టిఫై చేసిందంటే ఇక పాఠకుల నుంచి కూడా అలాంటి ఆదరణే ఉండేది. శనివారం సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక కాసేపు కథ గురించి ఆలోచించేవాడిని. తర్వాత సినిమాకు పోయి వచ్చి కథ రాయడం మొదలు పెట్టేవాణ్ణి. మరుసటి రోజు ఫెయిర్ కాపీ తయారు చేసుకుని నారాయణగూడకు వెళ్లేవాడిని. ఎక్కువ కథలు నేను ఆ రోజుల్లో రాసినవే! నవలలు కూడా ఆరోజుల్లోనే ఎక్కువగా రాశాను.

నేను అదృష్టవంతుడిని

నా జీవితంలో వ్యక్తిగతమైన విషయాలు ఎంత గాఢమైనవో, స్నేహితులతో నా అనుభవాలు అంతకన్నా గాఢమైనవి. హైదరాబాద్ వదిలి వెళ్లాల్సి వస్తే ఈ అనుభవం అంతా చేజారిపోతుందన్న భయం ఉండేది. ఉద్యోగరీత్యా బదిలీ అవుతుందేమో అన్న బెంగ ఎప్పుడూ ఉంటూ ఉండేది. అదృష్టవశాత్తు 37 ఏళ్ల నా రైల్వే జీవితం జంటనగరాల్లోనే గడిచింది. హైదరాబాద్ రైల్వే జీవితంలో నాకు లభించిన గొప్ప స్నేహితుడు బాలు (పి.వి. బాలసుబ్రమణ్యం). మరొక ఆత్మీయుడు విశ్వం. స్త్రీ పురుష భేదం లేకుండా ఎందరో నా జీవితాన్ని పండించారు. ముఖ్యంగా స్నేహితులే నా జీవితం అనిపించారు. సహ రచయితల్లో కొంతమంది నా సహ కుటుంబీకుల్లా నా కష్టసుఖాల్లో మెలిగారు. చంద్ర, కె.వివేకానందమూర్తి, నాయనికృష్ణమూర్తి, జి.ఎస్.సూరి.. అలాగే వంశీ, వాసిరెడ్డి నవీన్, కె.శివారెడ్డి నాతో ఆత్మీయంగా వుంటారు.

కథలు రాయడం ఇష్టంగా చేశాను

మేం ఏలూరులో ఉన్న రోజులనుంచీ కూడా నాకు అర్ధరాత్రి దాటితే కానీ నిద్రపోయే అలవాటు లేదు. స్నేహితుల్తోటి, ఒంటరిగా కూడా వీధుల్లో తిరిగేవాణ్ణి. రైల్వేలో రాత్రి డ్యూటీలు కూడా ఉండేవి. అందువల్ల చాలామంది రాత్రి జీవితాలు నాకు పరిచయం అయ్యాయి. వీళ్లల్లో ఎక్కువ మంది ఇళ్లు వాకిళ్లు లేనివాళ్లే! మనం నిత్యం తిరుగుతున్న చోటే, మన పక్కనే జరుగుతున్నవి, మనం చూసి కూడా గమనించనివి నా ఈ రాత్రి పరిచయాల వల్ల నాలోకి ఇంకించుకునే అవకాశం దొరికింది. మెజారిటీ సామాన్య జీవితాలకు భిన్నంగా ఉండే వీళ్ల దారుణ స్థితిగతులు పదిమంది దృష్టికి రావాలని చాలా కథలు రాశాను. వాళ్ళ స్థితిగతులకన్నా ముఖ్యంగా వాళ్ల తత్వాలు రాశాను. చాలామంది గొప్పవాళ్లమనుకునే పెద్దవాళ్లకన్నా, అద్భుతంగా జీవితాన్ని తమలోకితీసుకోగలిగిన వాళ్ల నైజం వెలికి తీసుకురావాలనే ఎక్కువగా ప్రయత్నించాను. ఏ మనిషీ పూర్తిగా చెడ్డవాడో, పూర్తిగా మంచివాడో అయి ఉండడని పాలగుమ్మి పద్మరాజు గారంటారు. రకరకాల జీవితాల్లో ఉన్న అతికొద్ది మంచితనం, అద్భుతమయిన స్పందన, సహజీవనం నేను అనుభవించి కథలుగా మలచటం చాలా ఇష్టంగా చేశాను.

రమణి (మాణిక్యాంబ)

దైవంకన్నా ఎక్కువే!

తల్లి మనుషులందరికీ ఇష్టమే! అలాగే మా అమ్మంటే నాకూ చాలా ఇష్టం. 2005లో ఆవిడ చనిపోయింది. సాహిత్య జీవితంలో నాకో చిన్న

బహుమతి వచ్చినా, ఎవరైనా మెచ్చుకున్నా ఎంతగానో పొంగిపోయేది మా అమ్మ. 1979లో విశాలాంధ్ర నవలల పోటీలో శ్రీశ్రీ గారి చేతుల మీదుగా నా నవలకు బహుమతి అందుకోవటం చూసి ఎంతగానో పొంగిపోయింది. 'పుట్టిల్లు', 'మా భూమి' చిత్రాల్లో నటించిన మా అమ్మ రమణి (మాణిక్యాంబ) సంగీత విద్వాంసురాలు. ఆమె జీవితం నాకు ఎప్పుడూ ఒక గొప్ప సాహిత్య వస్తువే! ఆడవాళ్లు ఇంటిపనికే చాలా సతమతమవుతూంటారు. అలాంటిది 1950 ప్రాంతంలోనే కుటుంబ భారం వహించిన ఆవిడ నా దృష్టిలో దైవం కన్నా ఎక్కువే!

మా అక్క గాది రాధాదేవి, నా చెల్లాయిలు కృష్ణకుమారి, శాయికుమారి, నా బావలు శేఖర్, రఘుకుమార్, అల్లుడు ప్రవీణ్, నా పిల్లలు ఉదయమోహన్, శశిమోహన్, నవ్య, నా మనవలు విష్ణుమానస్, శ్రీవత్స జీవన సహచరి.. నాది చాలా చక్కటి కుటుంబం.

స్మైల్ కాలేజీలో నా సీనియర్

సాహితీ జీవితంలో చాలామంది రచయితలు, మిత్రులు నన్ను ముందుకు నడిపించిన వారెందరో ఉన్నారు. నా మిత్రులలో ఘంటా వెంకటేశ్వరరావు, రావి రాంప్రసాద్, ఉప్పలపాటి వెంకటేశ్వరరావు (పండు) ముఖ్యులు. అలాగే స్మైల్, నేను ఏలూరులో కాలేజీలో చదువుకునే రోజుల్లో నాకు సీనియర్. ఇస్మాయిల్‌గారు, ఈ మధ్యనే కీర్తిశేషులైన భరాగో గారు కూడ నాకు మంచి మిత్రులు. భమిడిపాటి జగన్నాథరావు గారి సాన్నిహిత్యం నా కథారచనకు ఒక కొత్త దృక్కోణాన్ని అనుభవంలోకి తీసుకొచ్చింది. స్త్రీలు పడే నిత్య శ్రమని, వారి సౌందర్యాన్ని గమనించే నా సామాన్య దృష్టిని, వారిలోని సహనం, ఔదార్యం వేపు మళ్ళే కొత్త చూపుని ఆయన నాకు అలవాటు చేశారు. ఇలాంటి సంఘటనలు నా సాహితీ జీవితంలో చాలా ఉన్నాయి.

సాయంత్రమయితే ఏలూరు పోతాననేవాడిని

మా అమ్మమ్మ కొవ్వలి గంగమ్మ గారికి నేనంటే చాలా ప్రేమ. వారు సరిపల్లెలో ఉండేవారు. నేను సెలవుల్లో అక్కడికి వెళ్ళేవాణ్ణి. అయితే సరిపల్లెలో కరెంటు ఉండేది కాదు. నాకేమో నవలలు చదవాలనే పిచ్చి. ఏలూర్లో కరెంటు ఉండేది. రాత్రి పూట కూడా నిద్ర వచ్చేదాకా చదువుకోవచ్చు. అందుకని సాయంత్రమయితే చాలు నేను ఏలూరు వెళ్లిపోతాననేవాడిని. నన్ను ఆపడం కోసం అమ్మమ్మ పెద్ద టార్చిలైటు కొని, చదువుకోవడానికి అనువుగా దిండ్లు ఏర్పాటు చేసేది.

కుటుంబం బతికేంత చదువుంటే చాలు

మా అమ్మమ్మ నన్ను చిన్నతనంలో బాగా గారాబంగా పెంచింది. ఆమె ప్రేమ ఎలా ఉండేదంటే, వేసవిలో తాటిముంజెలు లేతలేతవి ఏరి వాటిని చిన్నచిన్న ముక్కలు చేసి, వాటిల్లో పటికబెల్లం వేసి అవి చల్లగా అయ్యాక నాకు తినిపించేది. మా పెద్దబ్బాయిని కూడా అలాగే పెంచింది. నేను చిన్నప్పుడు స్కూలుకు వెళ్ళి చదువుకోలేదు. నేను అలా చదువుకోలేదు అనడం కంటే అమ్మమ్మ గారాబంతో నన్ను స్కూలుకు పంపలేదు అనడం బాగుంటుంది. తాతయ్య టీచరు. ఇంట్లోనే ఆయన నాకు ట్యూషన్ ఏర్పాటు చేశారు. ఎంట్రన్స్ రాసి ఒకేసారి సెవెన్త్‌క్లాస్‌లో చేరాను. మా కుటుంబంలో పెద్దపెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలు చేయాలనే ఆలోచనలు ఉండేవి కావు. కుటుంబం బతికేంత జీతం వచ్చే చదువు చాలు అనే ధోరణిలో ఉండేవారు. అందువలనే నేను కూడా పెద్దగా అకడమిక్ చదువులు చదువుకోలేదు. బందర్లో ఇంజనీరింగ్ కాలేజీలో 'ఎ.ఎం.ఐ.ఇ.' కొంతవరకు చదివి వదిలేశా.

నా అల్లరంతా పిన్నమ్మ భరించింది

ఏలూర్లోనే దామరాజు అన్నపూర్ణమ్మ అని మా పిన్నమ్మ ఉండేది. నా చిన్నతనంలో నా అల్లరంతా ఆమే భరించింది. నాకు చిన్నప్పుడు జ్వరం వచ్చినా, చిన్న తలనొప్పి వచ్చినా సరే, నన్ను వాళ్లింటికి తీసుకెళ్లిపోయేది. చాలా ప్రేమగా చూసుకునేది. నా కోసం ప్రత్యేకంగా వంటలు వండి పెట్టేది. ఆమె జీవితకాలమంతా అందరికీ వండిపెట్టడంతోనే సరిపోయింది. ఆమె ఇంట తినని బంధువులు ఎవ్వరూ ఉండరు. వంట చేయడం, పదుగురికి పెట్టడం ప్రయాసగా మా పిన్నమ్మ ఏనాడూ భావించలేదు. ఆమె పేరుకు తగినట్టుగా అన్నపూర్ణమ్మే!

కథలు హాయిగా ఉండాలి

నవలలు, వ్యాసాలు, రివ్యూలు.. ఇలా చాలా రాసినా నాకిష్టమయినది కథ. మనం మరొకరికి ప్రత్యేకంగా చెప్పుకునే ఏ విషయమయినా నా దృష్టిలో కథే! హాయిగా ఉండటమే కథకు కావలసిన మౌలిక లక్షణం. బాధయినా, సుఖమయినా సూటిగా ఆత్మీయంగా చెప్పాలి. నిడివి నిర్మాణాలను కథ దానంతటదే నిర్ణయించుకుంటుంది.

మనిషితనం కోల్పోకూడదు

ఇప్పటి కథల్లో కొత్త జీవితం వస్తోంది. విభిన్న జీవన రీతులకు సంబంధించిన కొత్త తరం ఇవాల్టి కథల్లో ఉంది. వారు తమకు సంబంధించిన సమస్యల్ని కేంద్రీకరించి కథలు రాస్తున్నారు. మానవత్వాన్ని పట్టించుకోని ఏ కథా బాగుండదు. కథల్లో మానవత్వం కోసం ప్రత్యేకించి కృషి చేయాల్సిన పని లేదు, రచయిత మనిషితనం కోల్పోకుండా ఉంటే చాలు. కథ మేధకు చేరటం కన్నా, మనస్సుకు చేరటం ముఖ్యం. ఆ వేపు యువ రచయితలు కృషి చేస్తే బాగుంటుంది. మా తరంలో ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ చాలా విపరీతమయిన ఖాళీ సమయం ఉండేది. ఇప్పటి ఉద్యోగాల్లో అలాంటి పరిస్థితులు లేవు. చాలా బిజీ అయిపోయారు. అటువంటి ఖాళీ లేని వాతావరణంలో కూడా నేటితరం రచయితలు కథకోసం సమయం కేటాయించడం చాలా విశేషం. ఇది నాకు బాగా నచ్చింది.

మహాకవి శ్రీశ్రీ, మిత్రుడు చంద్రతో...

నా కథలకు ప్రేరణ అదే!

ఇప్పుడు చాలామంది రచయితలు, సమస్యలను పట్టుకుంటున్నారు. వాటిని కథలుగా మలుస్తున్నారు కానీ, సామాన్యుడిలోని గొప్పతనాన్ని చాలామంది పట్టుకోవడం లేదు. సామాన్యుడి ప్రవర్తనలోని వైచిత్రిని కూడా పట్టుకోవడం లేదు. ఇప్పటి మానవ జీవితం సమాజాన్ని చాలా ప్రభావితం చేస్తోంది. మనిషి ప్రవర్తనలో లెక్కకు మిక్కిలి మార్పులు జరుగుతున్నాయి. నా మటుకు మనిషి ప్రవర్తనే నా కథలకు ప్రేరణ.

-సుంకోజి దేవేంద్రాచారి

నాకు నచ్చిన నా కథ

రేకుబందుల నీడ

- వి. రాజారామమోహనరావు

పెద్ద మర్రి చేరేటప్పటికే అరగంట పట్టింది వెంకన్నకి. ఈ లెక్కన నడక ఇంకా గంటేనా పడుతుందనుకున్నాడు. ఆరోజు పని అయిపోయిం తరువాత, సాయంత్రం, ఏడు ఏడున్నరకి భోజనం చేసి బయల్దేరాడు వూళ్ళో... ఎప్పుడూ అలాగే ఆ టైముకే బయలుదేరతాడు. కాని ఆరోజు ఆలస్యమైంది నడక.

నిన్న పనిలో.. లారీ లోడ్ చేస్తుంటే జారి, కాలు మడతపడి కుడిపాదం బెణికింది. నిన్నటి బెణుకు ఈవాల్టికి బాగా మోపుచేసి అడుగు తొందరగా సాగనివ్వటం లేదు.

ఆలస్యం గుర్తింపు కొచ్చేటప్పటికి ఆక్కుండా వెళ్ళిపోదామనుకున్నాడు. కానీ కుడికాలు బాగా బరువుగా వున్నట్టనిపించింది. తలొంచి చూసుకుంటే పాదం చుట్టూ చీకటే తప్ప పాదం కనబట్టం లేదు.. తలెత్తి చూశాడు మర్రివేపు. రోడ్డుకి ఎడం పక్కన వందగజాల్లో ఎవరో నిలబెట్టిన పెద్ద చీకటి గొడుగులా కనిపించింది వెంకన్నకది. ఆ రోడ్డమ్మట వచ్చీ పోయేటప్పుడు చాలాసార్లు చూశాడు దాన్ని... చూసినప్పుడల్లా తనుండే రేకులగది గుర్తొస్తుంది. మర్రి చెట్టుకీ, తనుండే రేకులగదికీ ఏమిటో సంబంధం – ఎన్నిసార్లు ఆలోచించినా వెంకన్నకి అంతుపట్ట లేదు.

ఇంచుమించు ఏడాదిక్రితం మొదటిసారిగా యిదే మట్టిరోడ్డమ్మట నడుస్తూ దాన్ని చూశాడు. ఆరోజు మటుకు పెద్దగా పరికించి చూళ్ళేదు. ఏదో యధాలాపంగా చూశాడు. చూసిన ఆ ఒక్కక్షణంలోనే తనుండే రేకులగది గుర్తొచ్చింది... ఆ గుర్తు ఎంతోసేపు నిలవలేదు.

ఆరోజు చాలాచిత్రమైన కంగారులో వున్నాడు తను. అసలు వెళ్దాం వెళ్దాం అని చెప్పి ఆ ప్రయాణం పెట్టింది సాంబడు. తీరా చివరికి పేకాటలో కూచుని... ''మళ్ళీ ఎప్పుడేనా ఎల్దాంలే. ఆట మంచి పట్టులో వుంది'' అని ఎగ్గొట్టేశాడు. సాంబణ్ని ఎలాగేనా ఆటలోంచి లేవదీయాలని ఒకటి రెండు చిన్న ప్రయత్నాలు చేసినా సాంబడు కదల్లేదు.

ఉంటున్న వూరే కొత్త వెంకన్నకి. అక్కడకొచ్చి ఆర్నెల్లు కూడా కాలేదప్పటికి.

ఉద్యోగం కోసం ఎక్కడెక్కడో దేవుళ్ళాడుతుంటే, ఈ వూళ్ళో కాకిరాయి తవ్వకం జరుగుతోందని, ఏదో పని అక్కడ దొరక్కపోదని ఎవరో చెప్పేరు. అప్పటి తన పరిస్థితిలో వెనకాముందూ ఆలోచించకుండా, బయలుదేరి ఆ వూరొచ్చాడు. వూళ్ళో బస్ దిగేటప్పటికి యింకా వెలుగు పూర్తిగా రాలేదు. ఎదురుగా చిన్నపాక హోటలుంటే కాఫీ తాగి వాళ్ళనీ వీళ్ళనీ వాకబుచేసి నెమ్మదిగా చేరాల్సిన చోటికి చేరాడు.

అక్కడ చూసేటప్పటికి వాళ్ళంతా ఓ రెండొందలమందేనా వుంటారనిపించింది. గునపాల చప్పుడూ... సుత్తిమోతలూ.... రాళ్ళ పగుళ్ళూ..... చల్లటిగాలి... పల్చటి ఎండా... చూస్తూ నిలబడిపోయాడు.

అప్పుడే బాగా పైకొస్తున్న సూర్యుడి వెలుగు ఆ పెద్దపెద్ద జేగురురంగు రాళ్ళమీద పడి మెత్తగా జారిపోతోంది... జారిపోతున్న వెలుగులో ఆకుపచ్చ గీతలు మెరుస్తున్నాయి వాటిమీద.

ఓ కాలు మడతపెట్టిన పొంటు, చేతిలో సంచీతో నిలబడి చిత్రంగా చూస్తున్న ఆ కొత్తమొఖాన్ని అటువేపు వెళ్తున్న సాంబడే ముందుగా పలకరించాడు.... ''ఎవరు కావాలి'' అని... అటు ఇటు దిక్కులు చూస్తున్న వెంకన్నకి ఏం జవాబు చెప్పాలో వెంటనే తట్టక సాంబణ్ణి ఎగాదిగా చూస్తుండిపోయాడు.

పొట్టిగా పిక్కలా మనిషి.... చిన్న కాకీ నిక్కరు... నీలం రంగు గళ్ళ బుష్కోటు... మెళ్ళో చేతిరుమాలు... పక్క పాపిడి.. చిత్రంగా కనిపించాడు సాంబడు వెంకన్నకి.

నెమ్మదిగా తేరుకుని ''ఎవరూ అక్కర్లేదు?'' అన్నాడు చిన్నగా నవ్వు తెచ్చుకుంటూ.

ఆ నవ్వు కనిపెట్టినట్టు ''పనికోసమా?'' అన్నాడు సాంబడు. వెంకన్న ఔనన్నట్టు తలూపగానే దగ్గరుండి తనే తీసికెళ్ళాడు పెద్ద మేస్త్రీ దగ్గరికి.

ముందు రాళ్ళు కొట్టే పనిచ్చారు వెంకన్నకి. అలవాటు లేని పని. ఆ రోజంతా నానా యాతనపడ్డా... సాయంత్రమయ్యేసరికి చేతుల్లాగేయి కాని తోటివాళ్ళు చేసిన పనిలో నాలుగోవంతు పనైనా చేయలేదు. ఇంక అందరూ ఇళ్ళకెళ్ళిపోతుంటే తనెక్కడికెళ్ళాలో తోచలేదు వెంకన్నకి. అది చూసి సాంబడు అడిగేడు ''కూడా యింకెవ్వరూ రాలేదు కదూ'' అని వెంకన్న రాలేదన్నాడు.

''మా ఆడాళ్ళు లేరు. నిన్ననే పుట్టింటికి పురుటికెళ్ళారు. ఐదారు నెలల్దాక నేనొక్కణ్ణే. ముందు నాల్రోజులు అక్కడుంటే తర్వాత ఏదోటి చూసుకోవచ్చు'' అని యింటికి తీసుకెళ్ళాడు.

మొదటి రెండు నెలలూ సాంబడితోడుతో బాగానే గడిచిపోయాయి వెంకన్నకి. కలిసి పనిలో కెళ్ళటం, రావటం, వండుకు తినటం, పడుకోటం తప్ప పెద్దగా ముఖ్యమైన విషయాలేమీ జరుగలేదు. జరిగిన మార్పల్లా రాళ్ళు కొట్టే పనిలోంచి లారీ లోడింగులోకి మార్చారు వెంకన్నని.

సాంబడు అప్పుడప్పుడు రాత్రిళ్ళు యింటిపట్టు నుండేవాడు కాదు. ఏ తెల్లవారుఝామునో వచ్చి మొద్దు నిద్రపోయేవాడు. పొద్దున్నే పనిలో కెళ్ళటానికి ఎంతో కష్టం మీద నిద్ర లేచేవాడు.

ఒకసారి వెంకన్న చొరవగా అడిగితే చెప్పాడు సాంబడు. ''పేట... కెళ్ళొచ్చా''నని. అలా చెప్పిన తర్వాత ఆ విషయం పెద్దగా పట్టించు కోలేదు వెంకన్న.

నాలుగోనెల మధ్యలో వెంకన్న మకాం మార్చాడు. ఊరికి రాయి తవ్వకం జరిగేచోటికి అరమైలు దూరం వుంటుంది. తవ్వకం జరిగేచోట ఏ యిల్లూ లేదు. అందుకని గునపాలు, పారలు, గబేళాలు పెట్టుకోటానికి ఓ రేకుల గది కట్టించారు. వెంకన్న ఒంటిగాడని తెలిసి, వుంటే అందులో వుండమని మేస్త్రీ చెప్పాడు.

ఎప్పటికేనా ఓగూడు అవసరమేకదా అని మాట్లాడకుండా ఒప్పుకున్నాడు

వెంకన్న. అప్పుడంతకన్నా ఎక్కువగా ఆలోచించలేకపోయాడు.

పగలు పని జరుగుతున్నంతసేపు ఎంతో హడావిడిగా వుండే ఆ చోటు రాత్రిళ్ళు నిశ్శబ్దంగా వుండేది. క్రమేపీ అలవాటైనా... వెంకన్నకి ఒంటరి తనం బాగా తెలిసొచ్చింది. ఆ ఒంటరితనంలోనే సాంబడు చెప్పిన పేట గుర్తొచ్చింది.

తనూ పేట రావాలనుకుంటున్నాన్న సంగతి వెంకన్న సాంబడితో చెప్పటానికి మరో నెల పట్టింది. విన్న సాంబడు ముందు చిన్నగా నవ్వాడు... నవ్వి ఆ రోజు ప్రయాణం పెట్టేడు... పెట్టి పేకాటలో కూచుని లేవకపోయేటప్పటికీ ఏం చేయాలో తోచలేదు వెంకన్నకి.

పేటకి దారి సాంబడు చెప్పేడు కానీ కొత్త. ముందుగా నాలుగు రోజుల్నుంచి ఆ ప్రయాణం వూహించుకోటంలో వున్న ఉబలాటం వెంకన్నని నిలవనివ్వలేదు. చివరికి ఒంటరిగానే బయల్దేరాడు. ఆ రోజు రాత్రి దృష్టంతా చేరే చోటు మీదే ఉంది. ఎక్కడ దారి తప్పి పోతుందోనని సాంబడు చెప్పినదారి గుర్తు చేసుకోటం మీదే ఉంది. అందుకని ఆరోజు మర్రిచెట్టుని చాలా యధాలాపంగా చూశాడు.

ఆరోజు నడవటం కూడా చాలా తొందరగా నడిచాడు వెంకన్న. పేట చేరటానికి గంట కూడా పట్టలేదు. సాంబడు చెప్పిన గుర్తుల ప్రకారం ఆ యిళ్ళ దగ్గరి కెళ్ళేటప్పటికి మరో పావుగంట పట్టింది.

వెంకన్న నడిచొచ్చిన మట్టిరోడ్డు పేట కాలవమీద వొంతెనని కలుస్తుంది. వంతెనదాటి కుడిచేతివేపు తిరిగి కాలవమ్మటే ఎగువకి నడిస్తే నాలుగో లైటు స్తంభం దగ్గరని చెప్పాడు సాంబడు. వెంకన్న సరిగ్గా నాలుగో లైటు స్తంభం దగ్గర నిలబడి చూశాడు... రాత్రి తొమ్మిది దాటుతున్నా పేటలో సందడి తనుండే వూరుకన్నా ఎక్కువగా వున్నట్టే కనపడింది. నెమ్మదిగా రోడ్డు మీంచి పల్లంలోకి దిగేడు. ఎదురుగా పాకలు కనిపిస్తున్నాయి. వాటిలో అక్కడోటి అక్కడోటి లైట్ల వెలుగులేకపోతే మట్టికుప్పల్లా కనిపించేవి.

''ఔనా... కాదా'' అని తటపటాయిస్తూ కాసేపు నిలబడ్డాడు వెంకన్న. పది నిమిషాలు గడవకముందే ఓ పన్నెండేళ్ళ కుర్రాడు రెండుసార్లు వెంకన్న చుట్టూ తిరిగాడు.. తిరిగి 'వస్తారా' అన్నాడు నెమ్మదిగా.

'ఎక్కడికి' అన్నాడు వెంకన్న గబుక్కున.

''పాకల్లోకి'' అన్నాడు కుర్రాడు మరింత నెమ్మదిగా.

అవేనని నిర్ధారణైపోయింది వెంకన్నకి. వెంకన్న రోడ్డువేపు చూస్తూ మాట్లాడలేకపోయే సరికి మరోసారి అడిగి వెళ్ళిపోయాడు కుర్రాడు.

వెళ్తున్నది పాకల్లోకే అయినా అంత చిన్నకుర్రాడితో కలిసి వెళ్ళాలనిపించ

లేదు వెంకన్నకి. కుర్రాడు వెళ్ళిపోయేక పాకల వేపు నడిచాడు. వీధి మొదట్లో వున్న రెండు పాకల తలుపులు వేసేసి వున్నాయి. మూడోపాక గుమ్మంలో కూచునుంది ఆమె.. వెంకన్నని చూడగానే లేచి నిలబడింది. పాకలోని లైటు వెలుగు చాలాకొద్దిగా పడుతోంది వీధిలోకి. ఆ వెలుగులో ఆ మనిషి కొద్ది లావుగా, పుష్టిగా వున్నట్టు మాత్రం తెలిసింది వెంకన్నకి.

వెంకన్న దగ్గరికి రావటం చూసి ఓ అడుగు గుమ్మంలోకి వేసి... 'రండి' అంది.

ఆమె వెనకాలే లోపలికెళ్ళాడు. వొత్తి తగ్గించుకున్న హరికెను లాంతరు తప్ప ఏం కనపడలేదు. లాంతరు హెచ్చించింది. ఆమె హెచ్చించిన లాంతరు వెలుగు అడుసు గోడమీదకి... గోడమీది అద్దం మీదికి.. అద్దం పైన దువ్వెనమీదికి పాకింది.

సాధ్యమైనంత వరకు వెలుగులోకి తిరిగింది తను. ఎత్తుగా బుగ్గ, సన్నటి గీతలా కలిసిన పెదాల అంచులు, పొడుగాటి ముక్కు, ముక్కు పుడక... సగం విరిగినట్టు చెవికమ్మ.

ఆమె ముఖం పూర్తిగా కనబడలేదు వెంకన్నకి. చూస్తున్నానన్న గ్రహింపు లేకుండా చూస్తున్నాడు. గుండ్రటి భుజం మీంచి... జాకెట్టు బిగువు మీంచి జారుతున్న వెంకన్న చూపుల్ని... ''ఏం వుంటారా?'' అన్న ఆమె మాటలు కాస్సేపు కదలకుండా చేశాయి. పెద్దగా ఏ ఆలోచనా లేకుండానే వుంటానన్నట్టు తలూపాడు వెంకన్న.

ఆమె వెళ్ళి చెక్క తలుపు దగ్గరగా లాగి గొళ్ళెం వేసి వొస్తుంటే వెంకన్న చూపులు గుమ్మందాకా వెళ్ళొచ్చాయి. తలుపు పక్కగా పొడుగాటి చెక్క బల్లుంది. నూనిసీసా... ఓ గ్లాసు... ఇంకా ఏవో ఒకటి రెండు సీసాలు వున్నాయి దానిమీద.

తనొచ్చి లాంతరు తీస్తుంటే చూశాడు... అంతవరకు లాంతరు చిన్న అడ్డ గోడ మీదుంది. అదే ఆ చిన్నపాకని రెండుగా చేస్తోంది.

ఆమె లాంతరు తీసుకుని మళ్ళీ గుమ్మం వేపు వెళ్తుంటే ఏం చెయ్యాలో తోచక అలాగే నిలబడ్డాడు. క్రిందగా ప్రక్కనే పక్క పరిచుంది. అటువేపు తిరిగి లైటు పైకెత్తి తగ్గిస్తుంటే తన మెడ వెనకనుంచి వెలుగు తగ్గుతూ లాంతర్లోకి వెళ్ళిపోయింది. లాంతరు చెక్కబల్లమీద పెట్టి దగ్గరగా వచ్చి ''కూచోండి'' అంది.

ఓసారి అటూ ఇటూ చూసి చెప్పులొదిలి పక్క చివరగా కూచున్నాడు. తనూ కూచుంది.

ఇందాకటికన్నా చీకటిగా వుంది. మనిషి దగ్గరగా వుండటం మూలాన్ని కనిపిస్తోంది.

''కొత్తకదూ...'' అంది కొద్దిగా వెంకన్నవేపు తిరుగుతూ.

భార్యకాక యింకా ఒకరిద్దరు ఆడాళ్ళని వెంకన్న ఎరుగను. కానీ ఇలా రావటం కొత్తే... ఆమెకెలా తెలిసిందా అనుకున్నాడు.

''బాగా అలవాటున్నాళ్ళయితే బేరాలాడకుండా వూరుకోరు'' అంది నెమ్మదిగా నవ్వుతూ.

వెంకన్న నవ్వాడు. జేబులోంచి డబ్బు తీశాడు.

''తర్వాత ఇవ్వొచ్చులెండి'' అంది దగ్గరగా జరుగుతూ

ఆరోజు వెంకన్న బాగా తొందరపడ్డాడు. ఉద్రేకపడ్డాడు. ఎంతోసేపు గడవకుండానే ఆపుకోలేనంత నిద్దరొచ్చింది. నిద్రపోయే లోపల జరిగిన వాటిలో బాగా గుర్తుగా తెలిసిందొక్కటే వెంకన్నకి.

''రాత్రంతా ఉంటారా?'' అని ఆమె అడగటం.

ఆరునెల్లుగా అలవాటులేని పనిలో, రాళ్ళు కొట్టటంలో, లారీలు నింపటంలో అలిసిన వెంకన్న వొళ్ళు, మనసు విశ్రాంతిగా పడుకున్నాయి ఆ రాత్రి. తెలతెలవారుతుండగా మెలుకువొచ్చింది వెంకన్నకి.

పక్కకి తిరిగి చూశాడు. చాలా అడ్డదిడ్డంగా పడుకునుంది. అరచేతి మీద ఓ బుగ్గ పరుచుకునుంది. రెప్పలు నిండుగా మూత పడున్నాయి.

రాత్రికన్నా బాగా కనపడింది ముఖం. మళ్ళీ ఎక్కడేనా చూస్తే పోల్చుకోగలడిప్పుడు. అలాగే తన ముఖంలోకి చూస్తుంటే గబుక్కుని భార్య ముఖం గుర్తొచ్చింది వెంకన్నకి. పోలిక ఎక్కడో ఉన్నట్టు తోచింది. అది తృప్తో, ఇబ్బందో తెలియక పోయినా ఓ చిత్రమైన అనుభూతి కలిగింది.

ఆరోజు పనిలోకి రావటానికి ఓ గంట ఆలస్యమైంది. సాంబడు కనిపించి ''రాత్రి వెళ్ళేవా?'' అన డిగేడు నవ్వుతూ.

ఇంచుమించు ఆ రోజంతా గుర్తొస్తూనే వుంది గడిచిన అనుభవం. తనకన్నా ఎక్కువగా ఆ పాక, పరిసరాలు గుర్తొచ్చాయి. మర్నాడు మరీను. అతి కష్టం మీద నాల్రోజులాగ్గలిగాడు. ఐదోరోజు మళ్ళీ బయల్దేరాడు.

రెండోసారి నడకలో దారి బాగా అలవాటుగా ఉంది. పెద్ద మర్రి, చెరువు, వొంతెన, నడక తిరగడానికి గుర్తులుగా ఏర్పడ్డాయి. పాక దగ్గర కెళ్ళేటప్పటికి తలుపేసుంది. ఒకటి రెండు నిమిషాలు నిలబడ్డాడు వెంకన్న. ఇబ్బందిగా అనిపించింది. ఓ ఐదు నిమిషాలు గడిచినా పాక తలుపులు తెరుచుకోలేదు. మరో పాకలోకి వెడదామా అనుకున్నాడు. అనుకోడం లోనే ఆ ఆలోచన తెగిపోయింది. నెమ్మదిగా వెనక్కి నడచి రోడ్డు దగ్గరకెళ్ళాడు. మనసంతా ఏదోలా అనిపించినా, ఆమెని వెంటనే చూడాలని బలమైన కోరిక పుట్టింది.

కాస్సేపటూ ఇటూ తిరిగి మళ్ళీ వెళ్ళాడు. గుమ్మం దగ్గరే గుర్తుపట్టి లోపలికి తీసికెళ్ళిందామె.

అంతకుముందే తను రావటం, ఇబ్బందిగా నిలబట్టం, వెనక్కి వెళ్ళటం ఇవన్నీ చెప్పాలనుకున్నాడు. కానీ చివరికి ''ఇందాకవచ్చి కాస్సేపు నిలబడి వెనక్కి వెళ్ళాను'' అని అనగలిగాడు పొడిగా. తలవొంచుకోటం తప్ప ఆమేం మాట్లాడలేదు. వెళ్ళి తలుపేసొచ్చింది.

ఆ రాత్రి వెంకన్నే ఎక్కువగా మాట్లాడాడు. ఆమె పేరు అడిగాడు. ఒకటి రెండుసార్లు 'వరాలు' అని పేరుతో పిలిచాడు కూడా. మొదటి రోజుకన్న దగ్గరగా అనిపించింది ఆమె. ఇద్దరూ ఆ రాత్రి చాలాసేపు నిద్దరపోలేదు. తెల్లారి వెళ్ళిపోతూ.

'మళ్ళీ వారం ఇదేరోజు వస్తా'నని చెప్పాడు వెంకన్న.

ఆ తర్వాత చాలాసార్లు వెళ్ళాడు. వెళ్ళిపోయేటప్పుడు మళ్ళీ ఎప్పుడొచ్చేదీ చెప్పి వెళ్ళేవాడు. వెంకన్న వెళ్ళినప్పుడల్లా ఆమె గుమ్మం దగ్గరే కూచునుండేది.

ఏడాదిగా తనతో కలిసి గడిపిన రాత్రుళ్ళలో ఎన్నో అనుభవాలు పోగేసుకున్నాడు వెంకన్న.

వరాలు విషయాలు చాలా తెలిశాయి వెంకన్నకి. ఒక్కోసారి రెండు మూడు రోజులు ఆమె భోజనం లేకుండా టీలతో గడుపుతుందని తెలిసి చాలా బాధపడ్డాడు. అది తెలిసిం తరువాత తను వచ్చినప్పుడల్లా తినగా మిగిలిన అన్నం వున్నా, కూరున్నా, ఏదున్నా తీసుకొచ్చి పెట్టేవాడు. ఒక్కోసారి మొత్తమంతా మూట కట్టుకొచ్చేవాడు. ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ తినేవారు.

వరాల్తో ఏదో ఒకటి మాట్లాడుతుంటే హాయిగా ఉండేది వెంకన్నకి. తను చేసే పని గురించి, నడిచొచ్చేదారి గురించి, సాంబడి గురించి, ఇలా... వరాలు

హక్కులేని అనుబంధాలు



ఎన్నో వేల ఏళ్ళగా కథలు వున్నాయి. మళ్ళీ కొత్తగా కథలు ఎందుకు? పాత కథల్లో లేనిది ఏం రాస్తాం?

మానవ ప్రవృత్తి ఏ కొలబద్దకీ లొంగేది కాదు. నిరంతరం మారుతూనే ఉంటుంది. ఆ మార్పులే నా దృష్టిలో కథా వస్తువులు. అందుకే మనిషి జీవితం ఉన్నంత వరకూ కథలూ ఉంటాయి. చెడూ మనలోనే.. మంచి, మంచిమీద అనురక్తీ మనలోనే. అలాంటి ఓ చిత్రమైన జీవితపు తునక నా 'పరస్పరం' కథ. వివిధ భాషలలోకి అనువాదం అవటమే కాక, జాతీయ స్థాయిలో వెలువడిన జ్ఞానపీఠ్ కథా సంకలనం లోనూ వచ్చింది. ఏ రచయితేనా నీకు నచ్చిన కథ చెప్పు అంటే.. ఒక్కటే చెప్పటం అంత వీలైన పని కాదు. నాకెంతో పేరు తెచ్చిన వరద, తెల్లటి చీకటి, అలజడి, కలసి బతకటం ఇలా ఎన్నో కథలు నాకిష్టమైనవే.

నైతికంగా గానీ, చట్టరీత్యాగాని, హక్కు లేకపోయినా కొన్ని అనుబంధాలు ఏర్పడతాయి. అటువంటి అనుబంధాల్లో నిస్సహాయత కూడా చాలా గొప్ప 'నీతి'లా కనిపిస్తుంది. దానికి కథా రూపమే 'రాబందుల నీడ'. ఈకారణంగా ఈ కథ నచ్చింది.

-వి. రాజారామమోహనరావు
9394738805

దగ్గర ఏం దాచుకోలేదు వెంకన్న. చెప్పగలిగినవన్నీ, చెప్పాల్సిన వన్నీ చెప్పాడు. వరాలు చాలా విషయాలు చెప్పేది.

ఒకళ్ళ నుంచి ఇంకొకళ్ళు దాచుకోవాల్సిన రహస్యాలేం వుండేవి కావు. ఇద్దరికీ భయాల్లేవు. కట్టుబాట్లులేవు. అబద్ధాల్లేవు. తృప్తిగా ఉండేది కలిసున్నప్పుడల్లా, తన దగ్గర కొచ్చేవాళ్ళ గురించి, వాళ్ళ ప్రవర్తన గురించి చాలా మామూలుగా చెప్పేది ఆమె... అన్నిట్లాగే అదీ వినేవాడు వెంకన్న. ఆ పాకలో వస్తువులు, ఆమె తెలిసినట్టే ఆ పాకచుట్టూ ఉండే బతుకులూ, తిండి తిన్నా లేకపోయినా తప్పనిసరిగా కట్టాల్సిన అద్దెలూ... ఒంటిని దొలుచుకుతినే రోగాలూ... వాటితోపాటు పోలీసుల మామూళ్ళు, పీడింపులు అన్నీ తెలిశాయి వెంకన్నకి ఏడాదిలో...

***

రోడ్డుపక్కగా కూచున్న వెంకన్న ఒకసారి కుడిపాదాన్ని తడిమి చూసుకున్నాడు. కొద్దిగా వాచినట్టనిపించింది. పొద్దునా చెప్పు తొడగనివ్వలేదు. రెండు వారాల క్రితం వరాలు దగ్గర్నించి వొచ్చేప్పుడు ఈరోజు వస్తానని చెప్పేడు. ఎదురు చూస్తుంటుంది. తను ఎదురుచూట్టం ఎలా వుంటుందో వెంకన్నకి తెలుసు.

ఆ గుమ్మంలో కూచుంటే ఎవరో ఒకరు రాబోతారు పాకలోకి, వద్దని వాళ్ళతో చెప్పినా... సంపాదన మీద ఆశ పీకుతూనే ఉంటుందట... ఆ విషయం ఆమే చెప్పిందోసారి.

నెమ్మదిగా లేచాడు వెంకన్న... పెద్ద మర్రి దాటి ముందుకు నడిచాడు. వెంకన్నకి దారిలో మర్రిలాగే మరో గుర్తు చెరువు. దాన్ని చూసినప్పుడల్లా పుట్టి పెరిగిన వూరు. ఆ వూళ్లో పెద్ద చెరువు గుర్తొస్తాయి. చెరువుతోపాటు అక్కడ గడిపిన రోజులు, పెళ్ళి... మొదటి కాన్పులో పోయిన భార్య – ఇలా తెరలు తెరలుగా అడుగుల్తో పాటు ఆలోచనలు కదుల్తాయి.

ఇదివరకు పేట వెళ్ళాలనుకున్నప్పుడల్లా ఏ గొడవా వుండేది కాదు. కానీ మూణ్ణెలుగా మేస్త్రీ గొడవ పెడుతున్నాడు. ఎలా తెలిసిందో? ఇప్పటికే ఐదారు సార్లు చెప్పాడు... ''నువ్వు రాత్రిళ్ళు షెడ్డులో ఉండటం లేదట. సామాను జాగ్రత్త అని'' పోనీ వూళ్లో ఏదేనా ఇల్లు చూసుకొని మారిపోదామంటే మేస్త్రీ పడనివ్వడు... ''నువ్వేదో పని చేస్తావని కాదు. రాయి పనిలో కెలాగూ పనికి రావు షెడ్లో ఉంటావనే ఇందులోనైనా వుంచుకుంది'' అన్నాడు తెగేసి మేస్త్రీ. ఆరోజు నుంచి ఆ రేకుల గదిలో ఒంటరితనం మరీ ఇబ్బందిగా ఉంది. 'ఈ ఆలోచనల్తో... చీకటిలో... కాలు నెప్పితో ఈ ప్రయాణాలు లేకుండా వుంటే... తనని, ఆ పాకలో వచ్చి పోయేవాళ్ళ మధ్య లేకుండా తీసుకొచ్చి తనతోనే తన దగ్గరే ఉంచు...' ఎదురుగొప్పు తగిలి కొద్దిగా తూలాడు వెంకన్న.

ఎంతతొందరగా నడవాలనుకున్నా గంటపైనే పట్టింది అక్కడికి చేరడానికి. సందు మొగలోంచే చూశాడు పాక గుమ్మం వైపు. వరాలు అక్కడ కూచుని లేదు.

పాక తలుపు ఓరగా వేసుంది. దగ్గరికెళ్ళి నెమ్మదిగా తోశాడు. లోపల లాంతరు ఆరిపోతున్నట్టు వెలుగుతోంది.... చాపమీద వెల్లకిత్తలా చీకటి పోగులా పడుకునుంది తను.

'నిద్దరపోతోంది...' అనుకున్నాడు.

నెమ్మదిగా తల కదిపింది... వెంకన్న వేపు చూసి ఎడం చెయ్యి కొద్దిగా ఎత్తింది.

''ఏమైంది?'' అన్నాడు వెంకన్న. లాంతర్ ఒత్తి పెద్దది చేస్తూ.

''జరం... కడుపునొప్పి...'' అంది చాలా చిన్నగా... ఒణుకుతూ వినిపించింది వరాలు మాట. చాపమీద పక్కనే కూచున్నాడు. మెడ మీద చెయ్యేసి చూశాడు. వేళ్ళ చివర్లలోంచి వేడి అరిచేయంతా పాకింది. వెంకన్న చేతిని తీసేసుకోబోతుంటే తన చేత్తో పట్టుకుంది వరాలు.

పదిహేను రోజులక్రితం తను చూసిన మనిషిలో ఈ మనిషి సగం లేదనిపించింది వెంకన్నకి. ఎన్నాళ్ళనుంచో తన లోపల దాక్కుని పీక్కుతింటున్న రోగం... లోపలింకేం దొరక్క, బయట పడినట్టు నీరసించి పోయింది వరాలు. బట్టలు బాగా మాసిపోయున్నాయి. చీర కుచ్చిళ్ళు వూడదీసినట్టు చాలా ఒదులుగా ఉన్నాయి.

ఈడు... జోడు... అందం... ఐశ్వర్యం
కళ్యాణం... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration &
Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

అమీర్‌పేట | నెల్లూరు
కూకట్‌పల్లి | తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు
విజయవాడ | (చెన్నయ్) టి.నగర్
గుంటూరు | బెంగుళూర్
తెనాలి | సేలం
విశాఖపట్నం | మధురై
రాజమండ్రి | వెల్లూరు
కాకినాడ | తిరుచి
ఖమ్మం | పాండిచ్చేరి
ఒంగోలు | ఈరోడ్
 | ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.

చుట్టూ ఓసారి చూశాడు వెంకన్న, తను పడుకున్న పక్కకి పక్కనే గోడవారగా ఎన్నో వుమ్ములు తడిగా మెరుస్తూ కనిపించాయి.

''ఆకలేస్తోందా?'' అన్నాడు... వేస్తోందన్నట్టు తలూపింది. నెమ్మదిగా తన చేతిలోంచి చేతిని తీసుకొని లేచాడు. బల్లమీద గ్లాసుంటే తీసుకొని బైటికి నడిచాడు. రాత్రి ఆ టైములో ఒంతెన మీద తప్ప దగ్గర్లో మరే దుకాణం వుండదు. అక్కడికెళ్ళి రెండు బన్‌రొట్టెలు కొన్నాడు. గ్లాసులో టీ పోయించాడు. జేబులో ఉన్న ఒక్కనోటు ఇస్తే నాలుగు రూపాయి కాయితాలు, కొంత చిల్లరా ఇచ్చాడు దుకాణం వాడు.

వెంకన్న లోపలికొస్తుంటే తను నెమ్మదిగా లేచింది. జ్వరానికి నాలుక చచ్చి రుచి తెలియలేదు. ఆకలి మరీ ఎక్కువైంది. ఎంతో ఆత్రంగా అందుకున్న రొట్టెలో సగం కన్న ఎక్కువ తినలేక పోయింది. వెంకన్న బలవంతం మీద... టీలో ముంచుకొని మిగిలిన సగం తింది. తిన్నాక నెమ్మదిగా వొరిగి మళ్ళీ పడుకుంది. మిగిలిన రొట్టె పొట్లం కట్టి బల్లమీద పెట్టి, కాసిన్ని నీళ్ళు తాగొచ్చి తన పక్కనే అడ్డగోడకి చేర్లబడి కూచున్నాడు. నెమ్మదిగా తల తిప్పింది వెంకన్నవేపు. లైటు వెలుగులో... ఆ కళ్ళల్లో సన్నటి నీటి పొర కనిపించింది వెంకన్నకి... వరాలు పెదాలు, బుగ్గలు వొణికాయి. ఏదో చెప్పాలన్నట్టు.... నెమ్మదిగా నీరసంగా... చివరికి ''నువ్వూ పడుకో'' అంది

అలాగే అన్నట్టు తలూపేడు వెంకన్న. లైటు తగ్గించి తన తల నిమురుతూ పక్కనే ఇందాకటిలాగే గోడ కానుకొని కూచున్నాడు. నూని ఎండిపోయి, దుమ్ముపట్టిన వెంట్రుకలు గరుగ్గా తగులుతున్నాయి వేళ్ళకి. తలెత్తి పైకి చూసాడు... పాక కప్పు చీకటిగా... చీకటి గూడు కట్టుకున్నట్టు కనిపించింది... నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాడు.

కాస్సేపటికి... మొదటి నిద్ర తెర కళ్ళని నిండుగా ముంచేస్తుంటే వెంకన్న

కళ్ళముందు చీకటిగూడు కనిపించింది... అందులోంచి ఎన్నో రాబందులు రెక్క లాడించుకుంటూ బైటికొచ్చాయి. రకరకాల రంగు లున్నాయి వాటికి... కొన్ని పాకంతా కలయ తిరిగాయి. కొన్ని పాక చుట్టూ ఎగిరాయి... ఓ రాబందుకి చిత్రంగా ఎర్రటిటోపీ ఉంది... మరో రాబందు కారాకిళ్ళీ నములుతూ, ముక్కు లోంచి అప్పుడప్పుడు రక్తాన్ని వుమ్మేస్తోంది.

అలా మగతగా రెండు మూడు గంటలు పడుకున్నాడు వెంకన్న. మధ్యలో అలికిడైతే వులిక్కిపడి లేచాడు.

వరాలు మెలికలు తిరిగిపోతోంది... ఆయాసపడుతోంది.. లైటు హెచ్చించాడు.

మూలుగుతూ పాములా మెలికలు తిరుగుతోంది. వెంకన్న లేవటం చూసి నెమ్మదిగా వెంకన్నని పట్టుకొని లేచింది. బైటికి తీసుకెళ్ళమన్నట్టు సైగ చేసింది. గుమ్మం దాటుతుండగానే పెద్దగా వాంతి చేసింది. కాసిని మంచి నీళ్ళిచ్చాడు... సొమ్మసిల్లిపోయి పడుకుంది కాసేపు... నొప్పి తగ్గలేదు... మూలుగుతూనే వుంది. ఆయాసపడుతూనే ఉంది. ఏం చెయ్యాలో తోచలేదు వెంకన్నకి.

''ఏదేనా మందెయ్యాలి'' అనుకున్నాడు. డబ్బు లేదు, నాలుగు రూపాయలే ఉంది. నెమ్మదిగా కుదుపుతూ అడిగాడు, ''డబ్బుందా'' అని. అలాగే ఆయాసపడుతూనే లేదన్నట్టు సైగ చేసింది వరాలు.

మొదటికన్నా ఆయాసం ఎక్కువౌతోంది. మాటిమాటికీ పొట్టపట్టుకొని, కాళ్ళు ముడుచుకొని బాధ పడుతోంది వరాలు. వెంకన్న ఇక ఉండలేక పోయాడు. గబుక్కున తలుపు తీసుకొని బైటికి నడిచాడు.

పాకల మధ్యలో, ఆ పెంకుటిల్లు తెలుసు వెంకన్నకి. గబగబా వెళ్ళాడు రంగమ్మిల్లిది. ఇంచుమించు ఆ పాకలన్నీ ఆమెవే. ప్రతి పాకకి పదిహేను రూపాయల అద్దె. అలా వొళ్ళమ్ముకునే వాళ్ళు కాకుండా మరెవ్వరేనా ఉంటే మూడు రూపాయలకన్నా ఎక్కువ అద్దె ఇవ్వరు ఆ పాకలకి. పాకల్లో వాళ్ళ దగ్గర నెల కాగానే రాక్షసిలా అద్దె వసూలు చేస్తుంది రంగమ్మ. దగ్గరికేసున్న తలుపుని దబ దబ బాదాడు వెంకన్న. లోపల్నుంచి గొణుగుతూ వచ్చి తలుపు తీసింది రంగమ్మ. వరండాలో లైటేసింది. వెంకన్నని చూసి, ''ఏంటి'' అంది విసుగ్గా నోరంతా తెరుస్తూ. కారాకిళ్ళీకి గారపట్టిన పెదాల్నిండా పాకింది వెలుగు.

''డబ్బుందా, ఓ పది రూపాయ'' లన్నాడు.

వెంకన్నకు రంగమ్మ తెలుసు. కాని రంగమ్మకి వెంకన్నెవరో తెలియదు.

''డబ్బేమిటి, ఎవరు నువ్వు'' అంది.

''ఆ పాకలో వరాలుకి జ్వరంగా ఉంది. వెంటనే డాక్టర్ని తీసుకు రావాలి. మళ్ళీ డబ్బు రేపిస్తా, ఉంటే తొందరగా ఇవ్వండి'' అన్నాడు వెంకన్న.

''అర్ధరాత్రి నా దగ్గరక్కెడుంటుంది డబ్బు? పాకలో వాళ్ళకి మామూలే, జబ్బులు. కొత్తేంకాదు. డాక్టరు వొద్దు, ఏం వొద్దు. అయినా మధ్యలో నీకెందుకీ గొడవ? వెళ్ళు. వెళ్ళు'' అంది. రంగమ్మ డబ్బు ఇవ్వదని నిర్ధారణగా తెలిసి పోయింది వెంకన్నకి. కనీసం డాక్టరు ఇల్లన్నా ఆనవాలు చెప్పమన్నాడు. విసుక్కుంటూనే చెప్పింది.

వెంకన్న తిరిగొచ్చేటప్పటికి వరాలు కదలకుండా శోషొచ్చినట్టు పడుకుంది. ముందు ఏదో తెలీని భయం వేసింది వెంకన్నకి. భుజం పట్టుకుని కుదిపాడు. నెమ్మదిగా కళ్ళు తెరిచింది. తెచ్చిన బిళ్ళవేసి మందు తాగించాడు. బిళ్ళ మింగుతున్నప్పుడు, మందు తాగుతున్నప్పుడు వెర్రిగా చూసింది వరాలు వెంకన్నవేపు.

ఆ తర్వాత తెల్లారటానికి మిగులున్న రెండు గంటల్లో జరగాల్సినవన్నీ చాలా తొందరగా జరిగిపోయాయి. మళ్ళీ ఇంకోసారి మందుతో సహా లోపల మిగిలిపోయిన రొట్టెని, వోపికనీ కక్కుకుంది వరాలు... కాసేపు కోడిపెట్టలా గింజుకుంది నెప్పితో. తెలతెలవారుతుండగా... వెంకన్న చేతిని తన చెంపమీదికి లాక్కుంటూ.... వెర్రిగా వెంకన్న వేపు చూస్తూ... ఆయాసపడుతూ చచ్చిపోయింది.

వెంకన్నకి ఏడుపు రాలేదు చాలాసేపు. కాస్సేపటికి లేచి నెమ్మదిగా వెళ్ళి రంగమ్మని నిద్దరలేపి సంగతి చెప్పేడు. తిట్టుకుంటూనే వచ్చింది.

ఎవరెవరికో కబురు పెట్టింది. నలుగురైదుగురు వొచ్చారు కాస్సేపటికి. ఎండపొడ పడుతుండగా చాపతో సహా వరాల్ని పాకబైటికి తీసు కొచ్చారు. మామూలుగా తిరిగే జనం సందడి ఎక్కువైంది. కొంచెం దూరంగా రాయిమీద కూర్చున్నాడు వెంకన్న. పడుకున్న వరాలు వేపు చూస్తూ....

రోడ్డమ్మట వెళ్తూ ఆగి వింత తెలుసుకుంటున్న ఎవరో మనిషికి ఇంకొకళ్ళెవరో చెప్పారు. ''ఏముంది మామూలే. దిక్కులేని చావు. నీతిలేని మనుషులింకెలా ఛస్తారు?'' అని.

ఆ మాటలు వెంకన్నకీ వినపడ్డాయి. ''నీతిలేక కాదు చచ్చిపోయింది. డబ్బులేక. సరైన బతుకులేక. చాలీచాలని సంపాదన పీక్కుతినే రాబందుల నుంచి రక్షణలేక, పెరిగే రోగాలు బాగు చేయించుకోలేక! అంతేకాని నీతి లేక కాదు'' అనుకున్నాడు. అందుకే కళ్ళ నిండుగా నీళ్ళొచ్చాయి.

ఆ నీళ్ళు గొణుక్కున్నాయి. ''వరాలు ఇంకా నాలుగు రోజులు బతికుంటే, బతికుంటే'' అని.

మరో గంటకి ముసలి ఎద్దొకటి మునిసిపాలిటీ బండిని లాక్కొచ్చింది. ఇద్దరు సాయం పట్టి వరాలుని అందులో ఎక్కించారు. ఎవరూ ఏడవ లేదు. బండికదలకుండానే చాలామంది పాకల్లోకి వెళ్ళిపోయారు.

ఆశ చావక, అంత తొందరగా వదులుకోలేక వెంకన్నే ఆ బండి వెనక కొంతదూరం నడిచాడు.

*

–'వసుధ' మాసపత్రిక తొలి సంచిక, జనవరి 1971